క్లుప్తంగా

ఆర్టీసీ ఉద్యోగులకు ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో సేవలందిస్తున్న వైద్యులు

రాజమహేంద్రవరం సిటీ: ఆర్టీసీ ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తామని రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో మేనేజర్ షేక్ షబ్నం తెలిపారు. ఆదివారం డిపో ఆవరణలో ఆర్టీసీ ఉద్యోగులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్టీసీ గ్యారేజీలో ఉద్యోగుల కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ శిబిరానికి వివిధ విభాగాల ఉద్యోగులు హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. వైద్యులు మోగంటి రాజేష్, తాడి సాహిత్య సేవలు అందించారు. డిపో అసిస్టెంట్ మేనేజరు అజయ్‌బాబు, జి.రామకృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సొసైటీ సభ్యులు ఈకేవైసీ చేయించాలి

కడియం: మండలంలోని వేమగిరి, కడియం, మురమండ, కడియపులంక సహకార సంఘాల పరిధిలో సభ్యులుగా ఉన్నవారు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని డీసీఓ శ్రీరాములునాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యుడు/సభ్యురాలి ఆధార్ కార్డు, ఫోన్ నంబర్, నామినీ వివరాలను ఆయా సహకార సంఘాల్లో అందజేయాల్సిందిగా కోరారు.

ఘనంగా శాంతి కల్యాణం



స్వామివారికి శాంతి కల్యాణం చేస్తున్న అర్చకులు

కడియం: దుళ్లలో ఉన్న బాలాత్రిపుర సుందరీ సమేత అగస్త్యేశ్వర స్వామివారి శాంతి కల్యాణం ఆదివారం ఘనంగా జరిగింది. ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. బ్రహ్మశ్రీ బాదంపూడి సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు పుల్లేటికుర్తి సత్యనారాయణశాస్త్రి, శ్రీకంఠం వినాయకశర్మ, పూజ్యం కిరణ్‌శర్మ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అన్నదాత నేస్తం.. డ్రోన్

- సమయం, ఖర్చు ఆదా
- మొగ్గు చూపుతున్న రైతులు



డ్రోన్‌తో పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

కడియం: వ్యవసాయంలో ఆధునిక సాంకేతికత అడుగుపెట్టాక రైతుల శ్రమ గణనీయంగా తగ్గుతోంది. కోత మెషీన్లు, మందుల స్ప్రేయర్లు.. తదితర ఆధునిక పరికరాల కారణంగా రైతులకు కాలం, ఖర్చు కూడా ఆదా అవుతున్నాయి. ఈ కోవలోనే రైతులకు మరింత తోడ్పాటు అందించేందుకు డ్రోన్లు కూడా సిద్ధమయ్యాయి. అన్‌మాన్డ్ ఎయిర్ క్రాఫ్టలను వాడుక భాషలో డ్రోన్లుగా వ్యవహరిస్తున్నారు. వీటి ద్వారా రసాయనిక పురుగు మందులు స్ప్రే చేయడం, ఎరువులు, విత్తనాలు చల్లడం వంటి రైత్వారీ పనులను చేస్తున్నారు. సుమారు ఐదేళ్ల క్రితం మన దేశంలో ప్రారంభమైన ఈ డ్రోన్ల విప్లవం.. ప్రస్తుతం గణనీయంగా విస్తరించింది. ప్రభుత్వ రంగంలో రాష్ట్రంలోని గుంటూరు జిల్లా లామ్‌లో ఉన్న ఆచార్య ఎన్జీ రంగా ఉద్యాన వర్సిటీ ఈ డ్రోన్లను రైతులకు పరిచయం చేయడంలో ముందుంది. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లోని వ్యక్తులకు ఈ యూనివర్సిటీలో రిమోట్ పైలట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ ద్వారా శిక్షణ అందిస్తున్నారు.

పల్లెల బాట

ప్రస్తుతం వ్యవసాయ డ్రోన్లు పల్లెబాట పట్టాయి. వరి, మొక్కజొన్న, చెరకు, పత్తి, అరటి తదితర అన్ని రకాల పంటలకు మందులను పిచికారీ చేసేందుకు డ్రోన్లను విరివిగా వినియోగిస్తున్నారు. ఎకరా విస్తీర్ణంలో పురుగు మందులు చల్లేందుకు కేవలం ఆరు నిమిషాల్లో పూర్తి చేస్తుండడంతో రైతులు వీటిపై ఆసక్తి కనబరుస్తున్నారు.

తగ్గిన ఖర్చు

సాధారణంగా ఒక ఎకరాలో పురుగు మందులు చల్లడానికి స్ప్రేయర్ అద్దె, కూలి, పెస్టిసైడ్ ఖర్చును పరిగణనలోకి తీసుకుంటే.. వరి పంటపై ఒక స్ప్రేయింగ్‌కు రూ.1,600 నుంచి రూ.2,500 వరకు ఖర్చవుతోంది. దాదాపు ఒకరోజు సమయం పడుతుంది. అదే డ్రోన్‌ను వినియోగిస్తే కేవలం ఆరు నిమిషాల వ్యవధిలోనే పని పూర్తవుతుండగా, సాధారణ స్ప్రేయింగ్‌లో వినియోగించే మందులో 70 శాతం మందు మాత్రమే సరిపోతుంది. ఎకరాకు డ్రోన్ ద్వారా స్ప్రే చేయడానికి రూ.500 నుంచి రూ.650 అద్దె వసూలు చేస్తున్నారు. ఈ లెక్కన పురుగు మందు ఖర్చు, డ్రోన్ అద్దె కలిపి రూ.1,200 నుంచి రూ.1,500ల్లోనే స్ప్రేయింగ్ పూర్తవుతోంది.

ఆరోగ్యమూ సేఫ్

రైతులు, కూలీలు పురుగు మందుల స్ప్రే చేసే సమయంలో పలు మార్లు వాటి ప్రభావం కారణంగా అనారోగ్యం భారిన పడే ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. పురుగు మందులు స్ప్రేయింగ్ చేసే వారి ఆరోగ్యం దీర్ఘకాలంలో దుష్ప్రభావాలకు లోనయ్యే అవకాశం ఉంది. డ్రోన్ స్ప్రేయర్ ద్వారా రైతులు, కూలీల ఆరోగ్యం సురక్షితంగా ఉంటుంది. అంతేకాకుండా మనుషులతో స్ప్రే చేసే సమయంలో ఒకవైపు మందు ఎక్కువగాను, మరోవైపు తక్కువగా పడే అవకాశం ఉంది. డ్రోన్‌తో జరిగే స్ప్రేలో అన్నివైపులా సమానంగా మందు పిచికారీ అవుతుంది.

అందుబాటు ధరల్లోనే..

ప్రస్తుతం సాగులో ఎదురవుతున్న కూలీల కొరత, పెట్టుబడులు పెరిగిపోవడం తదితర కారణాలతో రైతులు డ్రోన్ల వైపు మొగ్గు చూపుతున్నారు. అన్ని రకాల పంటలపైనా మందులను స్ప్రే చేయడంతో పాటు, ఎరువులు, విత్తనాలు చల్లేందుకు కూడా ఆధునిక డ్రోన్లు అందుబాటులోకి వచ్చాయి. రైతులకు అందుబాటు ధరల్లోనే ఇవి లభిస్తున్నాయి. కొన్ని బ్యాంకులు రుణ సదుపాయం కూడా కల్పిస్తున్నాయి. దీంతో ఆధునిక వ్యవసాయ డ్రోన్లపై రైతులు మొగ్గు చూపుతున్నారు.

– ఆకుల పవన్‌కుమార్, ఎస్ఏజీ డ్రోన్స్, నిడదవోలు

ఆదా ఎక్కువ

డ్రోన్లతో పురుగు మందు పిచికారీ వల్ల సమయం, డబ్బు, పురుగు మందు కూడా కలిసి వస్తోంది. పంట మొత్తం సమానంగా పిచికారీ అవుతుంది. 140 నుంచి 180 లీటర్ల నీటిని ఒక ఎకరా పంటపై మందు పిచికారీకి వాడేవారు. డ్రోన్ ద్వారా కేవలం 12 లీటర్ల నీటిలో అంతకు ముందు వాడే పురుగు మందులో 70 శాతం మాత్రమే వినియోగించి స్ప్రే చేశాం. ఫలితాలు బాగున్నాయి. మనుషులతో స్ప్రే చేయడానికంటే, డ్రోన్‌తో చేసిన పిచికారీ బాగుంది.

– పి.వేంకటేశ్వరరావు, రైతు, దుళ్ల

పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం

- నేడు, రేపు మాత్రమే..
- ఇళ్ల వద్ద అందుబాటులో ఉండాలని అధికారుల సూచన

రాజమహేంద్రవరం రూరల్: ప్రభుత్వం పెంచిన సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు అందజేసేందుకు రంగం సిద్ధం చేసింది. ఈ పింఛన్లను లబ్ధిదారులకు ఒకటి, రెండు తేదీల్లో మాత్రమే సిబ్బంది పంపిణీ చేస్తారని అధికారులు స్పష్టం చేశారు. ఆయా తేదీల్లో లబ్ధిదారులు తమ ఇళ్ల వద్ద అందుబాటులో ఉండాలని సూచించారు. పింఛన్లు ఇచ్చే సమయంలో లబ్ధిదారుల నుంచి సిబ్బంది ధ్రువీకరణ పత్రాలు తీసుకోనున్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ స్కీమ్‌లో భాగంగా రాజమహేంద్రవరం రూరల్ మండలంలో సోమవారం నుంచి లబ్ధిదారులకు పింఛన్లు అందజేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు రూరల్ ఎంపీడీఓ డి.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో 19,862 మంది లబ్ధిదారులకు రూ.13.58 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసినట్టు చెప్పారు. గ్రామ స్థాయిలో పింఛన్ల పంపిణీ పర్యవేక్షణకు మండల స్థాయి అధికారులను నోడల్ ఆఫీసర్లుగా నియమించినట్టు వివరించారు. గ్రామ సచివాలయం పరిధిలోని సచివాలయ ఉద్యోగులు.. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛను అందజేస్తారన్నారు. హుకుంపేట డీ–బ్లాక్, బొమ్మూరు గ్రామాల్లో రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు.

మండల పరిషత్ కార్యాలయం వద్ద..

కడియం: పెంచిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రారంభిస్తారని ఎంపీడీఓ జి.రాజ్‌మనోజ్ తెలిపారు. ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. పింఛన్ల పంపిణీకి ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. మండలంలో మొత్తం 12,144 మంది లబ్ధిదారులకు రూ.8.20 కోట్లు మంజూరయ్యాయన్నారు. మండలాన్ని 591 క్లస్టర్లుగా విభజించి, 249 మంది ప్రభుత్వ సిబ్బందిని ఇందుకు ప్రత్యేకంగా కేటాయించినట్టు వివరించారు. పింఛన్ల పంపిణీపై సిబ్బందికి ఇప్పటికే రెండుసార్లు శిక్షణ ఇచ్చామన్నారు. లబ్ధిదారులు దూరంగా ఉంటే, సొంత గ్రామాలకు చేరుకోవాల్సిందిగా కోరారు. ఒకటి, రెండు తేదీల్లో మాత్రమే పింఛన్ల పంపిణీ ఉంటుందన్నారు. పింఛన్ల పంపిణీ ధ్రువీకరణ పత్రంపై లబ్ధిదారుడు, పంపిణీ పర్యవేక్షించిన ప్రభుత్వ ఉద్యోగి సంతకం తీసుకుంటారన్నారు. రశీదును సిబ్బంది వద్ద ఉంచుకుని, మరో దానిని లబ్ధిదారుడికి అందజేస్తారని ఎంపీడీఓ తెలిపారు.

రైతుబజార్ నిర్మాణం పూర్తి చేయాలి

కడియం: ప్రజలకెంతో ప్రయోజనకరవంగా ఉండే కడియంలోని రైతు బజార్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని వైఎస్సార్ సీపీ నాయకుడు గిరజాల వీర్రాజు అన్నారు. అధికారుల అలసత్వం, కోర్టు కేసులు తదితర కారణాలతో రైతుబజారు నిర్మాణం ఆలస్యమైందన్నారు. ప్రస్తుతం అధికారంలోకొచ్చిన ప్రభుత్వానికి ఏ అడ్డంకులూ లేవని, రైతుబజార్ నిర్మాణాన్ని తక్షణం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. రైతుబజార్‌కు అనుబంధంగా ఉన్న షెడ్డును కూల్చివేయడంపై ఉన్న శ్రద్ధ, అక్కడే రైతు బజార్ నిర్మాణంపై కూడా పెడితే బాగుంటుందన్నారు. రాజకీయ అనుభవజ్ఞులైన రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి దీనిపై దృష్టి పెట్టాలని కోరారు. ఆయన వెంట స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

ఆర్యాపురం బ్యాంకును పరిరక్షించాలి

రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు

ప్రకాశం నగర్: సుమారు 118 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన ది ఆర్యాపురం కో–పరేటివ్ అర్బన్ బ్యాంకును అన్ని వర్గాల వారు రక్షించుకోవాలని, ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో నూతన పాలక మండలి ఏర్పడాలని అఖిల పక్ష నేతలు, ప్రజా సంఘాల ప్రతినిధుల రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆర్యాపురం బ్యాంకు పరిరక్షణ ధ్యేయంగా రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. బ్యాంకు మాజీ డైరెక్టర్ లంక సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ ఆర్యాపురం బ్యాంకు 78 వేల సభ్యత్వంతో అగ్రస్థానంలో ఉందని, ఇలాంటి బ్యాంకును రక్షించుకోవడానికి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో పాలక మండలిలో ఉండాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడుతూ ఎందరో మహానుభావులు రాజకీయాలకు అతీతంగా బ్యాంకును తీర్చిదిద్దారని కొనియాడారు. మాజీ డైరెక్టర్ లంక సత్యనారాయణ మాట్లాడుతూ బ్యాంక్ నేడు అభివృద్ధి చెందిందంటే ఒకప్పుడు సీపీఐ వేసిన పునాదే కారణమని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు బాలేపల్లి మురళీధర్, బోడా వెంకట్, సీపీఎం నగర కార్యదర్శి బి పవన్, జాంపేట బ్యాంక్ డైరెక్టర్ మహంతి లక్ష్మణరావు, మాజీ డైరెక్టర్ కొవ్వూరి శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు.

మంచినీటి పైపులైన్‌కు మరమ్మతులు



పైపులైను మరమ్మతులకు తవ్విన గోతులు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు బాలాజీపేట రోడ్డులో శృతి హాస్పిటల్ వద్ద గోదావరి సురక్షిత మంచినీటి పథకం వద్ద పైపులైను లీకేజీని ఆర్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్టు అధికారులు మరమ్మతులు చేపట్టారు. కొంతకాలంగా ఈ ప్రాంతంలో పైపులైను లీకేజీ వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అధికారులు పైపులైనును పూర్తి స్థాయిలో తవ్వి, మరమ్మతులు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో బాలాజీపేట రోడ్డులో ట్రాఫిక్‌ను మళ్లించారు. మరో రెండు రోజులు ట్రాఫిక్‌కు అంతరాయం ఉంటుందని అధికారులు చెప్పారు. గ్రామ ప్రజలు సహకరించాలన్నారు.

ఏపీఎన్‌హెచ్‌ఎం జేఏసీ నూతన కార్యవర్గం

ప్రకాశంనగర్: ఏపీఎన్‌హెచ్‌ఎంజేఏసీ నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం స్థానిక ఇన్నీసుపేటలోని యూపీహెచ్‌సీలో జరిగింది. సంఘ నూతన అధ్యక్షురాలిగా సుజాత, ప్రధాన కార్యదర్శిగా రాజశేఖర్, కోశాధికారిగా శ్రీరాములు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నుకైన నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, సమాన పనికి సమాన వేతనం, హెచ్ఆర్ పాలసీ అమలు, వన్ టైం బదిలీలు వంటి డిమాండ్లను సాధించుకోవడానికి రాష్ట్ర కమిటీతో కలిసి పనిచేస్తామన్నారు.

కలెక్టర్ ఆకస్మిక రాక

తాళం వేసి ఉన్న మండల పరిషత్ కార్యాలయం

రాజానగరం: కలెక్టరుగా బాధ్యతలు స్వీకరించిన పి.ప్రశాంతి ఆదివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి ఆకస్మికంగా విచ్చేశారు. సెలవు దినం కావడంతో ఉద్యోగులు ఎవ్వరూ లేరు. కార్యాలయానికి తాళం వేసి ఉండటంతో, సెల్‌ఫోన్‌తో కార్యాలయం ఫొటో తీసుకుని వెనుదిరిగారు. పక్కనే తహసీల్దారు కార్యాలయం ఉన్నా కానీ అటువైపు వెళ్లలేదు. అక్కడ కూడా ఆ సమయంలో చిరుద్యోగులు మాత్రమే ఉన్నారు. రంగంపేట మండలం, అచ్యుతాపురానికి వెళ్లిన ఆమె తిరిగొస్తూ రాజానగరం మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి వచ్చారు.

ప్రజల పక్షానే నిలిచాం

- కేడర్ మరింత బలోపేతం కావాలి
- వైఎస్సార్ సీపీ కీలక నేతల దిశానిర్దేశం
- పార్టీ సమావేశానికి భారీగా తరలివచ్చిన శ్రేణులు



సమావేశంలో మాట్లాడుతున్న జక్కంపూడి విజయలక్ష్మి. చిత్రంలో జక్కంపూడి రాజా, గూడూరి శ్రీనివాస్ తదితరులు

రాజానగరం: సార్వత్రిక ఎన్నికల అనంతరం నియోజకవర్గ స్థాయిలో దివాన్‌చెరువులోని ఎంఎఫ్ కన్వెన్షన్ హాలులో ఆదివారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశానికి సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాల నుంచి పార్టీ శ్రేణులు భారీ ఎత్తున తరలివచ్చారు. ఓటమితో నిరాశ, నిస్పృహలకు ఏమాత్రం తావు లేకుండా, ప్రజల పక్షాన నిలిచామనే భావనతో మరింత బలోపేతం కావాలనే తలంపును అందిస్తూ వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి ప్రసంగాలతో కేడర్‌ని చైతన్యపరిచారు.

సవాల్‌కు కట్టుబడి ఉన్నా..

మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజలే దేవుళ్లు, వారిచ్చిన తీర్పును ఎవరైనా శిరసా వహించాల్సిందేనన్నారు. రాజానగరం మండలంతో తమ కుటుంబానికున్న అనుబంధాన్ని దృష్టిలో పెట్టుకుని, ఈ మండల ప్రజలు తనకు ఎల్లప్పుడూ అండదండగా ఉంటారనే ఉద్దేశంతో ఎన్నికల్లో ఈ మండలంలో ఒక్క ఓటు ఎక్కువ తెచ్చుకున్నా, తాను రాజకీయాల నుంచి తప్పుకుంటాని ప్రత్యర్థికి సవాలు చేశానన్నారు. అయితే రాజకీయాల్లో ఉన్నప్పుడు మాట అనేది వ్యక్తిగతమని, నిర్ణయం మాత్రం సమష్టిగానే ఉంటుందని. తమ కుటుంబాన్ని అభిమానిస్తూ, ఆదరిస్తున్న వేలాది మంది కార్యకర్తల నిర్ణయం మేరకు నడుచుకోవాల్సి ఉంటుందన్నారు. నియోజకవర్గంలో గడచిన ఐదేళ్లలో తాను చేసిన అభివృద్ధి కంటే ఎక్కువ చేయగలరని అనిపించిన రోజున, తాను చెప్పిన మాటకు కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. ఏడాదిలోగా ఈ మేరకు అభివృద్ధి చూపగలిగితే తన మాటకు కట్టుబడి ఉంటానని వివరించారు. జక్కంపూడి కుటుంబానికి అధికారంతో, పదవులతో పనిలేదని, ఎవరికి కష్టం వచ్చినా కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. ఒక లారీ అయినా, తూటా అయినా జక్కంపూడి కుటుంబాన్ని దాటుకుని ముందుకు రావాలన్నారు.



సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు

వెనకడుగు వేసేది లేదు

పార్టీలో గ్రూపులు మంచిది కాదని, ఓటమికి అది కూడా కారణమనే భావిస్తున్నాను జక్కంపూడి రాజా అన్నారు. చాలాచోట్ల బహు నాయకత్వం ఉండటం భారీ నష్టం చేకూర్చిందని, కేడర్‌లో పోటీ తత్వం ఉంటే పార్టీ పటిష్టమవుతుందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నామని వెనకడుగు వేసేది లేదని, అధికారంలో ఉన్నదాని కంటే ఎక్కువగా పనిచేస్తామన్నారు. పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలకు ఎటువంటి కష్టం వచ్చినా జక్కంపూడి కుటుంబం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. అధికారంలో ఉన్నా, లేకున్నా తమకు ప్రజలే ముఖ్యమన్నారు. నియోజకవర్గంలోని మూడు మండలాల్లోని పార్టీకి చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.